## క్లుప్తంగా

### ఆరో రోజు 12 నామినేషన్లు

కర్నూలు (టౌన్): కర్నూలు నియోజకవర్గ ఎమ్మెల్యే స్థానానికి బుధవారం 12 నామినేషన్లు దాఖలయ్యాయి.ఇందులో శ్రీనివాసరావు (ప్రకాష్‌నగర్, స్వతంత్ర అభ్యర్థి ), ఏపీ రామయ్య యాదవ్ (దిన్నె దేవరపాడు, జాతీ య సమ సమాజ పార్టీ), రవికుమార్ ( కొత్తపేట, స్వతంత్ర అభ్యర్థి), జమిలాబేగం సయ్యద్ (ఆరోరానగర్, స్వతంత్ర అభ్యర్థి), కె. శ్రీనివాసులు (వాసవీ నగర్, జనవాహిని పార్టీ ), టి. భరత్‌కుమార్ (గఫార్ వీధి, స్వతంత్ర అభ్యర్థి ),ఏఎండీ ఇంతియాజ్(రెండు సెట్లు, (ఎన్‌ఆర్ పేట, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ),బన్నూర్ చంద్రశేఖర్‌రెడ్డి (ఎన్‌ఆర్‌పేట,స్వ తంత్ర అభ్యర్థి), భరత్ (శరీన్ నగర్, స్వతంత్ర అభ్యర్థి),షేక్ ఇంతియాజ్ ( గడ్డ వీధి, స్వ తంత్ర అభ్యర్థి), గాజుల అబ్దుల్ సత్తార్ (బాలాజీ నగర్, అన్నా వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ) ఉన్నారు. స్థానిక నగర సంస్థ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి భార్గవ్ తేజ ఆయా అభ్యర్థుల నామినేషన్లు స్వీకరించి వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఇప్పటి వరకు కర్నూలు నియోజవర్గానికి పోటీ చేసే వారి సంఖ్య 35 కు చేరింది.

### నేటి నుంచి సత్యసాయి ఉచిత వేసవి శిక్షణ శిబిరం

కర్నూలు కల్చరల్: శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం నుంచి మే 5వ తేదీ వరకు ఉచిత వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు సేవా సమితి జిల్లాఅధ్యక్షుడు మాకా అశోక్‌కుమార్ తెలిపారు. నెహ్రూనగర్‌లోని సత్యసాయి మందిరంలో ప్రతిరోజు ఉదయం 9 నుంచి 11.30 గంటలకు శిబిరం జరుగుతుందని పేర్కొన్నారు. రోజువారి జీవితంలో ఉపయోగ పడు శ్లోకాలు, ప్రార్థనలు, పిల్లల్లో మానవతా విలువలు పెంపొందించడానికి అవసరమైన కథలు, భారతీ సంస్కృతికి సంబంధించిన ప్రాథమిక వివరణ, పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యాలను పెంపొందించే కార్యక్రమాలు,శారీరక వికాసానికి అవసరమైన ఆటలు ,ధ్యానం, యోగ అంశాల్లో శిక్షణ ఇస్తామన్నారు.

### నైపుణ్యాలను గుర్తించాలి

కర్నూలు కల్చరల్: విద్యార్థుల్లో దాడి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు వేసవి శిక్షణ శిబిరాలు ఉపయుక్తంగా నిలుస్తాయని మాతృశక్తి విభాగం నగర కన్వీనర్ పావని అన్నారు. వీహెచ్‌పీ, మాతృశక్తి నగర శాఖ ఆధ్వర్యంలో ఠాగూర్ పాఠశాలలో బుధవారం వేసవి శిక్షణ శిబిరం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ భక్తి గీతాలు, సర్వదేవతల శ్లోకాలు, సూర్య నమస్కారాలు, బుద్ధి వికాసానికి, శారీరక వ్యాయామంతో పాటు వినోదాన్ని పంచే ఆటలు స్వాతంత్య్ర పోరాటంలో త్యాగం చేసిన దేశ భక్తుల జీవిత గాదలు, నీతి పద్యాలు, శతకాలు, తదితర అంశాల్లో వారం రోజుల పాటు శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఠాగూర్ విద్యా సంస్థల అధినేత చంద్రశేఖర రెడ్డి,వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి మాలిగ భాను ప్రకాష్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరా బంద్

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలో విద్యుత్ లోడ్ డైవర్షిఫికేషన్ పనులు జరుగుతుండటంతో వివిధ ఏరియాలకు గురువారం ఉదయం 6 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా బంద్ చేస్తున్నట్లు ఏడీఈ నాగప్రసాద్ తెలిపారు. పవర్‌హౌస్‌లో ఉన్న మౌర్య ఇన్ ఫీడర్‌లో అధిక లోడ్ ఉండటం వల్ల జెడ్పీలో ఉన్న ఉడ్‌ల్యాండ్స్ ఫీడర్‌కు లోడ్‌ను డైవర్షిఫికేషన్ చేస్తున్నట్లు ఆయన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జల మండలి, మౌర్యాఇన్ రోడ్డు, మెన్స్ మెడికల్ హాస్టల్, బంగారుపేట, రాజ్ విహార్ సెంటరు, ఉడ్‌ల్యాండ్స్ లాడ్జీ ఏరియా, గౌరిగోపాల్ హాస్పిటల్ ఏరియా, సుశీల నేత్రాలయ, ఓమినీ హాస్పిటల్స్ రోడ్డు, హబీబ్ ముబారక్ నగర్ ఏరియాలకు విద్యుత్ సరఫరా కొద్ది గంటల పాటు నిలుపుదల చేస్తున్నామన్నారు.

# విజయీభవ



ర్యాలీలో పార్టీశ్రేణులకు అభివాదం చేస్తున్న ఇంతియాజ్, చిత్రంలో రీజనల్ కో ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, ఎంపీ అభ్యర్థి రామయ్య, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ దంపతులు, నాయకులు అహ్మద్‌అలీఖాన్

- వైఎస్సార్‌సీపీ కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ నామినేషన్ దాఖలు
- భారీగా తరలి వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలు
- మండు టెండల్లో అభిమానులతో కిక్కిరిసిన రోడ్లు
- జమ్మిచెట్టు నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ
- అడుగడుగునా జననీరాజనం
- రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాల సమర్పణ
- మూడో సారి వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యం– అభ్యర్థి ఇంతియాజ్





ఎగురుతున్న వైఎస్సార్‌సీపీ బెలూన్లు

కర్నూలు (టౌన్): వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కర్నూలు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఏఎండీ ఇంతియాజ్ నామినేషన్ కార్యక్రమం బుధవారం అట్టహాసంగా జరిగింది. నియోజకవర్గ పరిధిలోని 33 వార్డులకు చెందిన పార్టీ ఇన్‌చార్జ్‌లు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు భారీగా తరలి వచ్చారు. ముందుగా స్వర్గీయ డాక్టర్ ఇస్మాయిల్ స్వగృహంలో కుటుంబ సభ్యులతో కలిసి ఇంతియాజ్ సర్వమత ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన స్థానిక పాతబస్తీ నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలిసి ఓపెన్‌టాప్ వాహనంలో నామినేషన్ వేసేందుకు బయలు దేరారు. పాతబస్తీ ఏరియాలో అడుగడుగునా ఆయనకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. వేలాదిగా తరలి వచ్చిన పార్టీ శ్రేణులు మండు టెండలను లెక్క చేయకుండా ర్యాలీలో పాల్గొన్నారు. మార్గమధ్యంలో పూలమాలలు, భారీ క్రేన్ల సాయంతో గజమాలలు వేసి అభిమానం చాటుకున్నారు. ర్యాలీలో జై జగన్ నినాదాలు మార్మోగాయి. దాదాపు నాలుగు గంటల పాటు ర్యాలీ సాగింది. ఉదయం 9.30 గంటలకు జమ్మిచెట్టు నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీలో అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్‌తో పాటు వైఎస్సార్‌సీపీ ఉమ్మడి జిల్లా రీజినల్ కో ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి బీవై రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే, కర్నూలు పార్లమెంట్ డిప్యూటీ రీజినల్ కోఆర్డినేటర్ ఎస్వీ మోహన్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ, కేడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ విజయ మనోహరి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు అహమ్మద్ అలీఖాన్ పాల్గొన్నారు. ర్యాలీ జమ్మిచెట్టు, వన్ టౌన్ పోలీసు స్టేషన్, పూలబజారు మీదుగా చౌక్, నెహ్రూనగర్, రాధాక్రిష్ణ థియేటర్, కాంగ్రెస్‌పార్టీ కార్యాలయం, పాత కంట్రోల్ రూమ్ మీదుగా వైఎస్సార్ సర్కిల్‌కు చేరుకుంది. 10 వ వార్డు కార్పొరేటర్ షేక్ యూనస్‌బాషా గుర్రంపై , 11 వ వార్డు కార్పొరేటర్ ఫరాజ్‌ఖాన్ ఒంటెపై ఫ్యాన్ గుర్తులు, పార్టీ జెండాలతో ర్యాలీలో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమంలో ఏఎండీ ఇంతియాజ్ సోదరులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ అస్లాం, కేఎం అన్వర్ బాషా, మున్వర్ బాషా, ఇర్ఫాన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**రెండు సెట్ల నామినేషన్ దాఖలు**

మధ్యాహ్నం 1.30 గంటల మధ్యన కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్.. కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి బీవై రామయ్య, కర్నూలు శాసన సభ్యులు హాఫీజ్‌ఖాన్, కర్నూలు మాజీ శాసన సభ్యులు ఎస్వీమోహన్‌రెడ్డి వైస్సార్‌సీపీ సీనియర్ నాయకులు అహ్మద్ అలీఖాన్‌తో కలిసి నగరపాలక సంస్థ కార్యాలయానికి చేరుకున్నారు. కర్నూలు అసెంబ్లీ అభ్యర్థిగా రిటర్నింగ్ అధికారికి రెండు సెట్ల నామినేషన్లు దాఖలు పరిచి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కార్యాలయం నుంచి బయటకు వచ్చి విలేకరులతో మాట్లాడారు. తన నామినేషన్‌కు కనీవినీ ఎరుగని విధంగా 33 వార్డుల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు వేలాదిగా రావడం సంతోషంగా ఉందన్నారు. జన స్పందన చూస్తే వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో తాను గెలువబోతున్నట్లు ఉందన్నారు. రాష్ట్రంలో 175 స్థానాలకు 175తో పాటు 25 పార్లమెంట్ స్థానాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నాయకత్వంలో గెలుస్తామని ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశారు. కర్నూలు నగరం వైఎస్సాఆర్ కాంగ్రెస్‌పార్టీకి కంచుకోట లాంటిదని, ఇప్పటికే రెండు సార్లు ఇక్కడ నుంచి పార్టీ అభ్యర్థులు గెలిచారన్నారు. ముచ్చటగా మూడో సారి తాను అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తానని చెప్పారు.



అభిమాన జన సంద్రం మధ్య వైఎస్సార్‌సీపీ కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్ నామినేషన్ ర్యాలీ



మునిసిపల్ ఆఫీసులో నామినేషన్ దాఖలుకు పార్టీ నాయకులతో కలిసి వెళ్తున్న ఇంతియాజ్

## క్లీన్‌స్వీప్ చేస్తాం

- కర్నూలు ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య
- పార్టీ నాయకులతో కలిసి నామినేషన్ దాఖలు



నామినేషన్ వేయడానికి వెళ్తున్న బీవై రామయ్యకు గుమ్మడికాయతో దిష్టి తీస్తున్న అభిమాని

కర్నూలు(సెంట్రల్): కర్నూలు పార్లమెంట్ స్థానానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బీవై రామయ్య నామినేషన్‌ను దాఖలు చేశారు. బుధవారం ఉదయం ఆయన తన క్యాంపు కార్యాలయంలో సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. విజయంతో తిరిగి వస్తావని హిందూ, క్రిస్టియన్, ముస్లిం మత పెద్దలు బీవై రామయ్యను దీవించారు. అనంతరం కుటుంబ సభ్యులు, పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, పార్టీ నాయకులు తెర్నేకల్ సురేందర్‌రెడ్డి, రాజావిష్ణువర్ధన్‌రెడ్డి, నాగరాజు యాదవ్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు రెడ్డిపోగు ప్రశాంత్ తదితరులతో కలసి కలెక్టరేట్‌కు వెళ్లారు. అక్కడ పార్టీ జిల్లా అధ్యక్షురాలు సత్యనారాయణమ్మతో కలసి కర్నూలు పార్లమెంట్ ఆర్వో కార్యాలయానికి వెళ్లారు. అక్కడ ఒక్క సెట్ నామినేషన్ దాఖలు చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. 2019 ఎన్నికల్లో మాదిరిగా ఈ సారి కూడా తాము ఉమ్మడి కర్నూలు జిల్లాలో క్లీన్‌స్వీప్ చేస్తామని చెప్పారు. కర్నూలు పార్లమెంట్ స్థానం బీసీల కంచు కోట అని, దీనిని బద్దలు కొట్టడం టీడీపీ తరంకాదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. ఎంపీగా గెలిచిన తరువాత ఈ ప్రాంత సమస్యలపై పార్లమెంట్‌లో పోరాటం చేస్తానన్నారు.



నామినేషన్‌కు ముందు బీవై రామయ్య ఇంట్లో సర్వమత ప్రార్థనలు

# అభివృద్ధి చేస్తాం.. అండగా నిలవండి

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్ష



ప్రచారం చేస్తున్న ఆదిమూలపు సతీష్, కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

కర్నూలు సిటీ: కోడుమూరు నియోజకవర్గంలోని ప్రతి పల్లెలో మౌలిక సదుపాయాలతో పాటు అభివృద్ధి పనులు మరింత చేస్తామని..ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కొత్తకోట ప్రకాష్ రెడ్డి, ఎం.మణిగాంధీ ప్రజలను కోరారు. బుధవారం కర్నూలు దిన్నెదేవరపాడు పంచాయతీలోని అంబేడ్కర్‌నగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఐదేళ్ల జగన్ పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి పనులను వివరించారు. మరింత అభివృద్ధి, సంక్షేమ పథకాలు కావాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలపాలని కోరారు.

**ఆదరణ చూసి ఓర్వలేకనే విమర్శలు**

అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సతీష్, కోట్ల హర్ష మాజీ ఎమ్మెల్యేలు ప్రకాష్‌రెడ్డి, మణిగాంధీ మాట్లాడుతూ.. వివిధ సంక్షేమ పథకాలతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ చేసి ఓర్వలేని ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని మండిపడ్డారు. గత ఎన్నికల్లోనే వారికి ప్రజలు బుద్ధి చెప్పారని.. ఈ ఎన్నికల్లో ఆ పార్టీలు కనుమరుగవుతాయన్నారు. ఓటు వేసే ముందు ఓసారి ఆలోచించి మంచి చేసే ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. ఎంపీగా బీవై రామయ్య, ఎమ్మెల్యేగా సతీష్‌ను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ప్రసన్నకుమార్, వైస్ ఎంపీపీ నెహిమియా, దిన్నెదేవరపాడు ఎంపీటీసీ సభ్యులు రామనాథ్ రెడ్డి, మద్దిలేటి, మాజీ సర్పంచ్ పెరుగు పురుషోత్తం రెడ్డి, నాయకులు శ్రీనివాసరెడ్డి, ప్రసాదు, ఎదురూరు వెంకటేశ్వర్లు, శేషిరెడ్డి అమర్నాథ్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, రేమట సంపత్, విష్ణువర్ధన్ రెడ్డి, అఖిల్ రెడ్డి, ఇసాక్, దామోదర్ నాయుడు, మౌలాలి, రాజశేఖర్, నందనపల్లె శేఖర్, మహానందిరెడ్డి పసుపుల శేఖర్, భాస్కర్, వినోద్ పాల్గొన్నారు.

**పార్టీ కార్యాలయం ప్రారంభం**

బి.తాండ్రపాడు గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కోడుమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డా.ఆదిమూలపు సతీష్, కుడా చైర్మెన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొత్త కోట ప్రకాష్ రెడ్డి హాజరై పార్టీ కార్యాలయాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఆ గ్రామంలో ఇంటింటి ప్రచారం ప్రారంభించారు. ఐదేళ్ల ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి చెబుతూ ఎన్నికల్లో ఓట్లు వేయాలని వారు కోరారు.

## పేదల సంక్షేమమే జగనన్న అజెండా



19వ వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న యువనేత కాటసాని శివనరసింహారెడ్డి

కల్లూరు: రాష్ట్రంలో పేదల సంక్షేమమే జగనన్న అజెండా అని వైఎస్సార్‌సీపీ నేత కాటసాని శివనరసింహారెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం కల్లూరు అర్బన్ 19వ వార్డులో వారు ఇంటింటికీ తి రుగుతూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ము ఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందించిన సుపరిపాలనకు ప్రజలు మద్దతు ఇస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిచేసుకోవాలన్నారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్‌రెడ్డి,శివరాం స్వామి,సంజీవరెడ్డి, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



టీకాలు వేసే విధానం గురించి వివరిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): ప్రజలు తమ ప్రాంతాల్లో జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. బుధవారం ఆయన స్థానిక శ్రీరామనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవజాత శిశువు రోగాల బారిన పడకుండా ఉండాలంటే వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలన్నారు. పుట్టిన బిడ్డ నుంచి 16 ఏళ్ల వయస్సు వరకు పలు విడతలుగా ప్రభుత్వం ఉచితంగా టీకాలు పంపిణీ చేస్తోందన్నారు. బీసీజీ నుంచి టీడీ వరకు అన్ని రకాల టీకాలు అందుబాటులో ఉన్నాయని, ఈ క్రమంలో వంద శాతం లక్ష్యాలను చేరుకోవాలంటే తల్లిదండ్రులు కూడా తమ బిడ్డల ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతూ నిర్దేశించిన కాలమానిని ప్రకారం టీకాలు వేయించాలన్నారు. సకాలంలో అన్ని రకాల టీకాలను చిన్నారులకు ఇప్పించడం వల్ల 12 ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ దివ్య, ప్రాజెక్టనిస్టు ఖలీల్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# మలేరియాకు ముకుతాడు!

- ఐదేళ్లలో గణనీయంగా తగ్గిన కేసులు
- దోమల నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు
- ఈ ఏడాది ఇప్పటివరకు ఒక్క కేసు మాత్రమే నమోదు
- నేడు ప్రపంచ మలేరియా దినోత్సవం

**దోమ పుట్టకూడదు...దోమ కుట్టకూడదు** అనేది ప్రభుత్వ నినాదం. ఎందుకంటే ఇది కుట్టడం ద్వారా ప్రాణాంతకమైన మలేరియా వ్యాధి సోకి ప్రాణాలకే ముప్పు ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో సర్కారు దోమల నివారణ చర్యలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నెల 25వ తేదీన 'ప్రపంచ మలేరియా దినోత్సవం' సందర్భంగా ప్రత్యేక కథనం.

కర్నూలు(హాస్పిటల్): దోమ కుట్టిన 12 నుంచి 15 రోజుల్లో మలేరియా వ్యాధి లక్షణాలు బయటపడతాయి. దీనిని ఎంత త్వరగా గుర్తిస్తే అంత త్వరగా పూర్తికాలం కోర్సు తీసుకోవాలి. మలేరియాలో ప్లాస్మోడియం వైవాక్స్ కంటే మెదడుకు సోకే మలేరియా(పీఎఫ్) చాలా ప్రాణాంతకమైంది. దోమ జీవితకాలం 21 రోజులు. అందులో అది లార్వా, ప్యూ పా దశ నుంచి దోమగా జీవించి ఉండేది వారం ను ంచి 10 రోజులు కంటే ఎక్కువగా ఉండదు. ఇంత తక్కువ సమయంలో అది మనుషులను కుట్టి వారి ని ప్రాణం పోయేలా చేసేంత శక్తివంతమైంది. జిల్లా లో 2016 నుంచి ఇప్పటి వరకు 336 మందికి మలేరియా సోకినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. గత పదేళ్ల కాలంలో మలేరియాతో ఒక్కరు కూడా మరణించలేదనిఅధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

**మలేరియా వ్యాధి వ్యాపించే విధానం**

ఆడ అనఫిలిస్ దోమకాటు వల్ల మలేరియా వస్తుంది. వర్షాకాలంలో నీటినిల్వ, దోమలు పెరిగే ప్రదేశా లు ఎక్కువ కావడం వల్ల జూన్ మాసం నుంచి డి సెంబర్ మధ్యకాలంలో ఎక్కువగా ఈ వ్యాధి ప్రబలుతుంది.

**వ్యాధి లక్షణాలు**

- చలి వణుకుతో కూడిన జ్వరం. సరైన వ్యాధి నిర్ధారణ, చికిత్స లేకపోతే నెలల తరబడి బాధిస్తుంది.
- రోగికి ప్రతిరోజూ లేదా రోజు విడిచి రోజు విపరీతమైన జ్వరం
- భరించరాని వేడి, విపరీతమైన చెమటలు, రోగి అలసటకు గురికావడం



మలేరియా నియంత్రణకు మురికి కాలువల్లో క్రిమిసంహారక మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

**నివారణ చర్యలు :**

- ఇంటి పరిసరాల్లో దోమలు పెరిగేందుకు అనువుగా ఉండే నీటి నిల్వలను నిర్మూలించాలి.
- తాగి పారేసిన కొబ్బరి బోండాలను ముక్కలుగా చేసి చెత్తకుండీలో వేయాలి.
- ఓవర్‌హెడ్ ట్యాంకులు, నీటినిల్వ పాత్రలను, ఎయిర్ కూలర్లు, డ్రమ్ములు లాంటి వాటిని పూర్తిగా ఖాళీ చేసి శుభ్రం చేయాలి.
- కాల్వలో వ్యర్థాలు, చెత్త, చెట్లకొమ్మలు వేయరాదు.
- వారానికిఒకసారి పూలతొట్టీల్లో,పూల కుండీలలో నీరు మార్చాలి.నీరు నిల్వ ఉండకుండా చూడాలి.
- దోమలు లోపలికి రాకుండా కిటికీలకు సన్న జాలిని కట్టాలి. దోమతెరలు తప్పనిసరిగా వాడాలి.
- ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలి.
- టైర్లు, రోడ్డుపై గుంతలో వర్షపునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలి.
- జ్వరం వచ్చిన వెంటనే నిపుణులైన వైద్యులను సంప్రదించాలి.

**జిల్లాలో మలేరియా కేసులు**

| సంవత్సరం | రక్తపూత పరీక్షలు | మలేరియా కేసులు |
|---|---|---|
| 2016 | 2,38,750 | 250 |
| 2017 | 2,51,986 | 16 |
| 2018 | 2,36,704 | 19 |
| 2019 | 2,49,187 | 8 |
| 2020 | 1,93,586 | 14 |
| 2021 | 2,56,395 | 18 |
| 2022 | 3,16,178 | 6 |
| 2023 | 4,18,850 | 4 |
| 2024 | 1,32,943 | 1 |

**విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు**

మలేరియా నియంత్రణ, నివారణ చర్యలకు గాను జిల్లాలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము. దోమలు కుట్టకుండా ఎవ్వరికి వారు స్వీయరక్షణ చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నాము. ఇల్లు, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని చెబుతున్నాము. ఈ ఏడాది జిల్లాలో ఒక్క కేసు నమోదైంది.

–డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్, డీఎంహెచ్‌వో, కర్నూలు

**నివారణ చర్యలతో మలేరియా నియంత్రణ**

జిల్లాలో మలేరియా వ్యాధి నివారణకు ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాము. గుర్తించిన కేసులకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స అందేలా చేస్తున్నాము. కేసు నమోదైన ప్రాంతంలో యాంటిలార్వా ఆపరేషన్ చేపడుతున్నాము. జిల్లాలో మలేరియా ప్రభావిత ప్రాంతాలను సమస్యాత్మక ప్రాంతాలుగా పరిగణించి గతంలో ఎన్నడూ లేని విధంగా అన్ని ప్రభుత్వ శాఖల సహకారంతో, సమన్వయంతో వ్యాధి నివారణ చర్యలు చేపట్టాము.

–నూకరాజు, మలేరియా అధికారి, కర్నూలు

### ప్రలోభాలపై పక్కా నిఘా

కర్నూలు (టౌన్) : ఓటర్లను ప్రలోభ పెట్టే వారిపై పక్కా నిఘా పెట్టాలని కర్నూలు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ ఆదేశించారు. బుధవారం స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో ఎన్నికల ప్రవర్తన నియమావళి, ఫ్లయింగ్‌స్క్వాడ్, స్టాటిక్ సర్వేయిలెన్స్, వీడియో సర్వేయిలెన్స్ బృందాలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ ఎప్పటికప్పుడు కర్నూలు నగరంలోకి ప్రవేశించే వాహనాలను క్షుణంగా తనిఖీ చేయాలన్నారు. డబ్బు, మద్యం, ఇతర వస్తువుల రవాణాపై పటిష్టమైన నిఘా పెట్టాలన్నారు. కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ నోడల్ అధికారి రంగస్వామి, టౌన్ ప్లానింగ్ డిప్యూటీ సిటీ ప్లానర్ సంధ్య పాల్గొన్నారు.

### సీపీఎం ఇంటింటా ప్రచారం

కర్నూలు(సెంట్రల్): సీపీఎం పాణ్యం అభ్యర్థి డి.గౌస్‌దేశాయ్ ఇంటింటా ప్రచారం ముమ్మరంచేశారు. బుధవారం కర్నూలు కార్పొరేషన్ పరిధిలోని 36,37 వార్డుల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించి తనను గెలిపించాలని ప్రజలను కోరారు.

### ఓటు హక్కు మనందరి బాధ్యత

కర్నూలు (టౌన్): ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వినియోగించుకోవడం మనందరి బాధ్యత అని ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ధనుంజయ అన్నారు. బుధవారం స్వీప్ ( ) ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ 221 పోలింగ్ స్టేషన్ నుంచి 230 పోలింగ్ స్టేషన్ల పరిధిలోని ప్రాంతాల్లో సాగింది. కార్యక్రమంలో బూత్ లెవల్ ఆఫీసర్లు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, రీసోర్స్ పర్సన్లు, పాదుపు మహిళా గ్రూపు సభ్యులు, స్వీప్ కార్యకర్తలు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ అభ్యర్థుల ప్రకటన

కర్నూలు(సెంట్రల్) : కాంగ్రెస్ పార్టీ కర్నూలు, మంత్రాలయం, ఎమ్మిగనూరు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. కర్నూలు అభ్యర్థిగా షేక్ జిలానీ బాషా, ఎమ్మిగనూరుకు ఎం. కాశీంవలి, మంత్రాలయంకు పీఎస్ మురళీ కృష్ణంరాజు పేర్లను ఖరారు చేస్తూ ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ బుధవారం ఓ ప్రకటన జారీ చేశారు.

### బోసిపోయిన 'బొగ్గుల' నామినేషన్ కార్యక్రమం

కర్నూలు సిటీ: కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి బొగ్గుల దస్తగిరి బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన ర్యాలీకి ఆశించి స్థాయిలో జనాలు రాలేదు. దీనికితోడు మాజీ కేంద్రమంత్రి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి వర్గం కూడా హాజరుకాలేదు. చేసేదేమీలేక టీడీపీ నాయకుడు డి.విష్ణువర్ధన్ రెడ్డి ఇంటి నుంచి కర్నూలు ఆర్‌డీఓ ఆఫీస్ వరకు ఎక్కడ ఆగకుండా వెళ్లి కర్నూలు ఆర్డీఓ ఆఫీసులో నామినేషన్ వేశారు. కాగా ర్యాలీకి వచ్చిన వారికి ఎస్టీబీసీ కాలేజీ ప్రాంగణంలో బిరియాని, క్వార్టర్ మద్యం సరఫరా చేశారు. ఆహారం అందరికీ అందకపోవడంతో కొద్దిసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది. టీడీపీ కూటమిగా ఏర్పడి ఎన్నికల్లో పోటీ చేస్తున్నా ఎక్కడ కూడా ర్యాలీలో బీజేపీ జెండాలు అగుపించక పోవడం గమనార్హం.

**వేసవి శిక్షణ శిబిరం**

కర్నూలు కల్చరల్: ఇరిస్ ఫ్లారెస్ట్ పాఠశాల, కర్నూలు సైక్లోన్ డ్యాన్స్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో గురువారం వారం నుంచి వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్న ట్లు నిర్వాహకులు ఐ.ఎం. స్వామి తెలిపారు. నెల రోజుల పాటు నిర్వహించే శిక్షణలో సోలార్ సిస్టమ్, క్లే ఆర్ట్, పెయింటింగ్, డ్రాయింగ్, వాల్ గ్యాంగింగ్, ఫొటో ఫ్రేమ్, క్రాఫ్ట్ వర్క్, ల్యాంప్‌షేడ్, మ్యాగ్రామ్ ఆర్ట్, వెస్టన్ డ్యాన్స్ అంశాల్లో నిపుణులచే శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.